సాక్షి
విశాఖపట్నం

బుధవారం । 3 । ఏప్రిల్ । 2024



పండుటాకులపై పగ



ప్రతి నెలా ఒకటో తేదీన పింఛను ఠంఛన్‌గా పొందే అవ్వాతాతలు, దివ్యాంగులు, వితంతువుల్లో ఆందోళన నెలకొంది. వీరి ఇళ్లకు వెళ్లి పింఛను అందజేసే వలంటీర్లను సేవల నుంచి తప్పించేందుకు కుట్ర పన్నిన చంద్రబాబు తీరుపై వారు మండిపడుతున్నారు. IIIలో

న్యూస్‌రీల్

విశాఖ స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తి, అమ్మకాల్లో ప్రగతి



స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తులు

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్ 2023–24లో ఉత్పత్తి, అమ్మకాల్లో ప్రగతి కనబరిచింది. గత ఆర్థిక సంవత్సరంలో వైర్ రాడ్ కాయిల్స్ 7.30 లక్షల టన్నులు, స్ట్రక్చరల్స్ 5.08 లక్షల టన్నులు ఉత్పత్తి చేసి అంతకు ముందు ఏడాది కంటే వరసగా 43 శాతం, 11 శాతం వృద్ధి నమోదు చేసింది. గత ఏడాది 47 లక్షల టన్నుల హాట్ మెటల్, 46 లక్షల టన్నుల లిక్విడ్ స్టీల్ ఉత్పత్తి చేసి రెండింటిలో 7 శాతం వృద్ధి సాధించింది. విలువ ఆధారిత ఉత్పత్తులు 13.24 లక్షల టన్నులు అమ్మకాలు చేసి అంతకు ముందు ఏడాది కంటే 37 శాతం వృద్ధి నమోదు చేసింది. సేలబుల్ స్టీల్ 43.12 లక్షల టన్నులు విక్రయాలు చేసి 15 శాతం వృద్ధి సాధించింది. ముడి పదార్థాలు అందుబాటులో లేకపోవడం, మార్కెట్ మందగమనం ఉన్నప్పటికీ గత ఏడాది రూ. 23,129 కోట్ల విక్రయాల టర్నోవర్‌తో 2 శాతం వృద్ధి నమోదయింది. వినియోగదారుల సంతృప్తిని మెరుగు పరచడానికి డోర్ డెలివరీ ప్రాతిపదికన 90 వేల టన్నుల ఉత్పత్తులను సరఫరా చేసింది. ఈ సందర్భంగా సీఎండీ అతుల్ భట్ సిబ్బంది, అధికారులను అభినందించారు.

నేటి నుంచి 7వ తేదీ వరకు పింఛన్ల పంపిణీ

మహారాణిపేట: ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అనుసరించి సామాజిక పింఛన్ల పంపిణీ ప్రక్రియ బుధవారం మధ్యాహ్నం 12.30 గంటలకు ప్రారంభమవుతుందని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. ఏప్రిల్, మే, జూన్ నెలల పింఛన్లు గ్రామ/వార్డు సచివాయ సిబ్బంది సచివాలయాల్లో అందజేస్తారన్నారు. పింఛనుదారులు ఆధార్ కార్డు తీసుకొని సచివాలయానికి వెళ్లాలన్నారు. 7వ తేదీ వరకు ఉదయం 7.30 నుంచి రాత్రి 7 గంటల వరకు పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి గ్రామ, వార్డు సచివాలయంలో పెన్షన్‌దారులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

కర్రి సీతారాంకు మంత్రి బొత్స పరామర్శ



కర్రి సీతారాంను కలసి ఆరోగ్య వివరాలు తెలుసుకుంటున్న బొత్స సత్యనారాయణ

సింహాచలం: ఇటీవల అనారోగ్యంతో బాధపడి కోలుకున్న భీమిలి మాజీ ఎమ్మెల్యే కర్రి సీతారాంను మంగళవారం రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ పరామర్శించారు. సింహాచలంలోని పాత గోశాల వద్ద ఉన్న సీతారాం స్వగృహానికి మధ్యాహ్నం బొత్స వచ్చారు. ఆయన్ని కలిసి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. వైఎస్సార్ సీపీ 98వ వార్డు అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు, ఇన్‌చార్జి ఎర్ర వరహా నరసింహం, అడవివరం కో–ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పల స్వామి, సింహగిరి వర్తక సంఘం అధ్యక్షుడు ముగ్గు కిరణ్, వైఎస్సార్ సీపీ నాయకులు లంక సత్తిబాబు, వరదా నరసింహమూర్తి, అక్కిరెడ్డి అప్పారావు, లండ రమణ తదితరులు బొత్స వెంట ఉన్నారు.

వియత్నాం చేరుకున్న 'పహెరేదార్'



కోస్ట్‌గార్డ్ సిబ్బందికి స్వాగతం పలుకుతున్న వియత్నాం అధికారులు

మల్కాపురం: ఆగ్నేయ ఆసియా దేశాల సమావేశంలో భాగంగా ఇండియన్ కోస్ట్ గార్డ్ కాలుష్య నియంత్రణ నౌక సముద్ర పహెరేదార్ మంగళవారం వియత్నాంలోని హో చి మిన్ పోర్టుకు చేరుకుంది. మూడు రోజుల పర్యటనలో భాగంగా ఇరు దేశాల మధ్య సంబంధాలు బలోపేతం చేయడం, కాలుష్య నియంత్రణ, సముద్ర అధ్యయనాల్లో పరిశోధనలు, సముద్ర చట్టాల గురించి కోస్ట్‌గార్డ్ అధికారులు చర్చించారు. ఈ సందర్భంగా 25 మంది ఎన్‌సీసీ క్యాడెట్‌లు వాక్‌థాన్, బ్లీచ్ క్లీన్ అప్ కార్యకలాపాల్లో పాల్గొన్నారు. హో చి మిన్‌కు ముందు.. ఈ నౌక ఫిలిప్పీన్స్‌లోని మనీలాను సందర్శించింది.

నమ్ముకుంటే నట్టేట ముంచారు

సీటు ఎలా ఇస్తాం.. రూ.50 కోట్లు చూపించాలని చెప్పాను కదా... అదేంటి సార్.. పార్టీ కష్టకాలంలో ఉంటే.. మా ఆస్తులన్నీ అమ్మి **క్యాడర్‌ను కాపాడుకుంటూ వచ్చాం కదా.. ఈ సమయంలో** ఇలా మాట్లాడితే ఎలా చెప్పండి. ఇదిగో రూ.20 కోట్లు మాత్రమే ఉన్నాయి. **మీరు కొంచెం సహకరిస్తే.. ఏయ్.. మాటల్లేవ్.. మాట్లాడుకో**దాల్లేవ్.. ఓటుకు నోటు ఎలాగో.. సీటుకు కోట్లు అలాగే.. ఇది ఫిక్స్. అసలే **పొత్తు లెక్కలతో ప్రతి సీటుకు డిమాండ్ బాగా పెరిగిపో**యింది. మీలాంటి వాళ్లకు సీటివ్వలేను. తమాషాలు చేయకుండా.. పార్టీకి పనిచేయండి.. **ఇవీ.. సీనియర్ నేతలు, పార్టీని భుజ**స్కంధాలపై మోసిన నాయకులతో చంద్రబాబు నిస్సిగ్గు వ్యాఖ్యలు.



- నోట్ల కట్టలున్న వారికే టికెట్లు కట్టబెట్టారని టీడీపీ నేతల ఆగ్రహం
- పార్టీని నమ్ముకొని పనిచేస్తే బాబు ద్రోహం చేశారని ఆవేదన
- కండువాపై కండువా వేసి పనిచేయలేమంటున్న క్యాడర్
- ప్రతి నియోజకవర్గంలో రగులుతున్న అసంతృప్తి
- కొత్తగా వచ్చిన వారికి టికెట్లు ఇవ్వడంపై పవన్‌పై క్యాడర్‌లో వ్యతిరేకత
- రెండు కత్తులు ఒకే ఒరలో ఇమిడే ప్రసక్తే లేదంటున్న జనసేన వర్గం

సాక్షి, విశాఖపట్నం : నోట్ల కట్టలు చూపించినవారికే టికెట్ కన్ఫార్మ్ చేసిన చంద్రబాబు వైఖరిపై ఆ పార్టీ నేతలు మండిపడుతున్నారు. పార్టీని నమ్ముకుంటూ పనిచేస్తుంటే నోట్ల కట్టలకు సీట్లు అమ్ముకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తోకపార్టీ జనసేన లోనూ ఇదే వైఖరి కనిపిస్తోంది. పదేళ్ల కష్టపడిన వారిని పక్కన పెట్టేసి.. కొత్తగా కండువా కప్పుకున్న వారికి టికెట్ కట్టబెట్టిన పవన్ వ్యవహారంపైనా క్యాడర్‌లో వ్యతిరేకత మొదలైంది. ఆత్మగౌరవాన్ని తాకట్టుపెట్టేసుకొని కండువాపై కండువా వేసుకుంటూ ప్రచారం చేయడం తమ వల్ల కాదంటూ టీడీపీ, జనసేన నాయకులు కుండబద్దలు కొట్టేస్తున్నారు. ఉమ్మడి విశాఖలో ప్రతి నియోజకవర్గంలోనూ ఈ అసమ్మతి కుంపటి రోజురోజుకూ రాజుకుంటోంది. ప్రతి నియోజకవర్గంలోనూ క్యాడర్ మొత్తం చంద్రబాబు, పవన్‌కల్యాణ్ తీరును తూర్పారపడుతున్నారు.

ద్వితీయశ్రేణి నేతలపై నిర్లక్ష్యం

ఉత్తర నియోజకవర్గం గంటా శ్రీనివాస రావు గెలిచిన నాటి నుంచి నియోజకవర్గం ముఖం చాటేసిన తర్వాత.. అక్కడి కార్పొరేటర్లు, ద్వితీయశ్రేణి నేతలు పార్టీకి కాపుకాస్తూ వచ్చారు. అయితే ఇక్కడ టికెట్‌ను బీజేపీకి కేటాయించడంతో పార్టీలో ఎదగనీయకుండా అడ్డుకుంటున్నారంటూ టీడీపీ నేతలు మండిపడుతున్నారు.

గంటాకు సీటు అమ్మేశారు

భీమిలి నియోజకవర్గంలో ఆది నుంచి క్యాడర్‌ను కాపాడుకుంటూ వస్తున్న కోరాడ రాజబాబు, కర్రోతు బంగార్రాజును గతంలో మెచ్చుకున్న చంద్రబాబు.. ఇప్పుడు వారి దగ్గర డబ్బులు లేవంటూ గంటా వైపు మొగ్గు చూపారు. సుమారు రూ.20 కోట్ల వరకూ ఖర్చు చేయగలనని చంద్రబాబుకు చెప్పి.. టికెట్ ఇవ్వాలని కోరాడ కోరినా.. సరిపోవంటూ బాబు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. దీంతో ఈ వర్గాలు బాబు వైఖరిపై మండిపడుతున్నాయి. భీమిలిని నాశనం చేసిన గంటాకు టికెట్ అమ్మేసుకున్నారంటూ టీడీపీ శ్రేణులే బహిరంగంగా ఆరోపణలు చేస్తున్నాయి.

జనసేనతో కోట్లకు బేరం

దక్షిణ నియోజకవర్గంలో టీడీపీ తరపున టికెట్ ఆశిస్తూ క్షేత్ర స్థాయిలో కార్యకర్తలతో మమేకమైన పార్టీ నేతలు డా.విల్లూరి చక్రవర్తి, నజీర్‌కి కూడా చంద్రబాబు మొండిచెయ్యి చూపించారు. పార్టీని నమ్ముకుంటూ వచ్చిన తమను మోసం చేయడం తగదని వేడుకున్నా.. వారి మాటలు వినేందుకు కూడా చంద్రబాబు, లోకేష్ ఇష్టపడలేదని సమాచారం. దీంతో దక్షిణ నియోజకవర్గాన్ని జనసేనకు కేటాయిస్తూ టీడీపీ అధినేత చంద్రబాబు బేరం కుదుర్చుకున్నాడని విమర్శలు కోడై కూస్తున్నాయి.

బండారుకు జెల్ల

పెందుర్తిలో సీనియర్ నేత బండారు సత్యనారాయణమూర్తికీ చంద్రబాబు జెల్ల కొట్టారు. చివరి వరకూ పార్టీ టికెట్ నీదేనంటూ హామీ ఇచ్చిన బాబు.. చివరి నిమిషంలో జనసేనకు కట్టబెట్టడంతో టీడీపీ క్యాడర్ అసంతృప్తితో రగిలిపోతోంది. బండారుకు బద్ధశత్రువైన పంచకర్ల రమేష్ బాబు వెంట పయనించే ప్రసక్తే లేదని, చంద్రబాబుకు ఇష్టం ఉంటే ఆయనే వచ్చి ప్రచారం చేసుకోవాలే తప్ప.. తాము సహకరించబోమని తెగేసి చెబుతున్నారు.

రూ.50 కోట్లకు సీటు అమ్ముకున్నాడని ప్రచారం

మాడుగుల సీటును మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ పీవీజీ కుమార్ సీటు ఆశించారు. వీరిని కాదని ఎన్ఆర్ఐ పైలా ప్రసాదరావుకు టికెట్ కేటాయించారు. రూ.50 కోట్లకు చంద్రబాబు టికెట్‌ను అమ్ముకున్నారన్న ఆరోపణలు టీడీపీ శ్రేణుల నుంచే వినిపిస్తున్నాయి.

డబ్బులు లేవని పక్కన పెట్టేశాడు

యలమంచిలి టికెట్‌ను జనసేనకు అమ్ముకున్నారంటూ టీడీపీ నేతలు మండిపడుతున్నారు. టికెట్ ఆశించిన ప్రగడ నాగేశ్వరరావు, పప్పల చలపతిరావు వద్ద డబ్బులు లేవన్న సాకుతో టికెట్ లేదని చెప్పడంతో.. వారిని నమ్ముకున్న క్యాడర్ రగిలిపోతోంది. సోమవారం జరిగిన ఆత్మీయ సమావేశంలోనూ పార్టీ శ్రేణుల మధ్య స్వల్ప ఘర్షణ జరిగింది. జనసేనకు చంద్రబాబు ఇక్కడ టికెట్‌ను అమ్ముకున్నాడని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నమ్ముకున్నోళ్లకు ఝలక్

అనకాపల్లి నియోజకవర్గంలోనూ ఇదే పరిస్థితి ఉంది. ఆది నుంచి పార్టీలో ఉన్న పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్దా నాగజగదీష్ టికెట్ ఆశించారు. వీరితో పాటు పూటకో పార్టీ మారే దాడి వీరభద్రరావు కూడా టికెట్ ఆశించి.. టీడీపీలోకి జంప్ అయ్యారు. వీరందరికీ చెక్ చెప్పి.. జనసేనకు టికెట్ కేటాయించడంపై అందరిలోనూ ఒక్కసారిగా ఆగ్రహం కట్టలు తెంచుకుంది. డబ్బులు మూటలకే టికెట్లు కేటాయించారంటూ చంద్రబాబుపై టీడీపీ కేడర్ విమర్శిస్తోంది.

'గ్లాసు'లోనూ అసమ్మతి తుపాను

ఇక పార్టీ పెట్టినప్పటి నుంచి చంద్రబాబుతోనే ప్రత్యక్షంగా, పరోక్షంగా పయనిస్తూ.. చెట్టపట్టాలేసుకొని తిరుగుతున్న జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌కు కూడా.. బాబు లక్షణాలు వంటబట్టాయి. తనని నమ్ముకొని పార్టీలోకి వచ్చిన వారి భవిష్యత్తును గాలిలో దీపం మాదిరిగా వదిలేశారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా జనసేన శ్రేణులు పవన్ పొత్తు వైఖరిని దుమ్మెత్తి పోస్తున్నారు. టికెట్ ఆశించి పార్టీకి ఏ తాడు బొంగరం లేకపోయినా అన్నీ తామై కోట్లు ఖర్చు చేసిన వారిని ఏమాత్రం పట్టించుకోలేదు. నియోజకవర్గంలో జనసేన కోసం పాటుపడిన వారికి, టికెట్ ఆశించి పార్టీలో చేరిన వారికీ పవన్ ఝలక్ ఇచ్చారు. భీమిలిలో పంచకర్ల సందీప్‌కు టికెట్ ఇస్తానని చెప్పి చివరి నిమిషంలో మోసం చేయడంపై భీమిలి జనసేన వర్గం పవన్ వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. దక్షిణంలో టికెట్ ఇస్తామన్న హామీతో గ్లాసు పట్టుకున్న కార్పొరేటర్లు కందుల నాగరాజు, సాధిక్.. పవన్‌ను నమ్ముకొని రోడ్డున పడ్డారు. ఉత్తర నియోజకవర్గంలో పసుపులేటి ఉషాకిరణ్‌కీ పవన్ వెన్నుపోటు పొడిచారు. గాజువాక టికెట్ ఆశించి పార్టీ కోసం రూ.కోట్లు ఖర్చు చేసిన సుందరపు సతీష్‌ని కరివేపాకులా తీసిపారేశారు. అనకాపల్లిలో పరుచూరి భాస్కరరావు పవన్ హ్యాండిచ్చారు. పాయకరావుపేటలో టీడీపీ అభ్యర్థి వంగలపూడి అనితకు సీటు ఇవ్వొద్దని జనసేన నేత గెడ్డం బుజ్జి అభ్యర్థన కూడా పవన్ కల్యాణ్ పరిగణలోకి తీసుకోలేదు. ఇలా కూటమి పేరుతో టికెట్లు అమ్ముకున్నారంటూ జనసేన శ్రేణులు కూడా దుమ్మెత్తి పోస్తున్నాయి.

మన్యంలో మాయాజాలం

పాడేరులో టికెట్ కోసం పోటీపడిన గిడ్డి ఈశ్వరి, మణికుమారిని కాదని.. డబ్బులు దండిగా ఉన్నాయన్న లెక్కలతో కిల్లు రమేష్‌నాయుడుకు చంద్రబాబు టికెట్ కేటాయించారు. దీంతో మిగిలిన రెండు వర్గాలూ.. ఇది మూమ్మాటికీ నోటుకు సీటు అంటూ చెబుతున్నారు. టికెట్ కోసం పోరాటం చేస్తాం తప్ప.. కూటమి వెంట నడిచే సమస్యే లేదంటున్నారు. టికెట్లు అమ్ముకుంటే పార్టీ కోసం పనిచేసేవారి పరిస్థితి ఏంటో చంద్రబాబు చెప్పాలని ప్రశ్నిస్తున్నారు.

అరకులో అదే తీరు

అరకులో పర్యటించిన సమయంలో దొన్నుదొర అభ్యర్థి అంటూ చంద్రబాబు స్వయంగా ప్రకటించారు. అయితే పార్టీ టికెట్ ఆశించిన కిడారి శ్రవణ్, అబ్రహంను కూడా పక్కకు నెట్టేశారు. అరకులో అంతగా ప్రభావంలేని బీజేపీకి చెందిన పాంగి రాజారావుకి టికెట్ ఇవ్వడం వెనుక రూ.కోట్లు చేతులు మారాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే అబ్రహం రెబల్‌గా పోటీ చేస్తానని ప్రకటించగా.. దొన్నుదొర, శ్రావణ్ వర్గాలు మాత్రం చంద్రబాబు వైఖరిని తప్పుపడితూ.. కూటమికి సహకరించే ప్రసక్తే లేదని స్పష్టం చేశాయి.

సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్..

- చేపల వేటకు వెళ్లిన ఆరుగురు మత్స్యకారులు
- సోమవారం రాత్రి నుంచి తెలియని ఆచూకీ
- నేవీ, కోస్ట్‌గార్డు బృందాలతో గాలింపు



నరేంద్ర



చిన్నారావు



సత్తయ్య



అప్పన్న



మహేష్



అప్పన్న



మత్స్యకార మహిళల ఎదురుచూపులు

మహారాణిపేట: సముద్రంలో వేటకు వెళ్లి గల్లంతైన మత్స్యకారుల ఆచూకీ కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు సాగుతున్నాయి. జిల్లా అధికార యంత్రాంగం వినతి మేరకు నేవీ, కోస్ట్‌గార్డు బృందాలు.. హెలికాప్టర్, రెండు నౌకలతో విస్తృతంగా గాలిస్తున్నాయి. వివరాలివీ.. ఫిషింగ్ హార్బర్ నుంచి సోమవారం ఐఎన్‌డీ–ఏపీ–వి1–ఎంవో–2736 నంబర్ బోటుపై కారి చిన్నారావు, వాసుపిల్లి అప్పన్న, కారి చిన్న సత్తయ్య, కారి నరేంద్ర, వాసుపల్లి అప్పన్న, మైలపల్లి మహేష్ వేటకు వెళ్లారు. పి.శ్రీనివాసరావుకు చెందిన ఈ బోటుపై వేట పూర్తి చేసుకుని.. మంగళవారం సాయంత్రానికి వీరంతా హార్బర్‌కు చేరుకోవాల్సి ఉంది. కాగా.. సోమవారం రాత్రి 10 గంటల సమయంలో బోటులో ఉన్న సిబ్బందితో శ్రీనివాసరావు మాట్లాడారు. ఆ సమయంలో గంగవరం ప్రాంతంలోని లోతైన ప్రాంతంలో వీరంతా వేట సాగిస్తున్నారు. రాత్రి 11 గంటల తర్వాత వీరికి ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వస్తోంది. బహ్య ప్రపంచంతో వీరికి సంబంధాలు తెగిపోయాయి. ఈ విషయం తెలుసుకున్న మత్స్యకారుల కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతూ హార్బర్‌లోని మత్స్యశాఖ జాయింట్ కలెక్టర్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. సమాచారం అందుకున్న మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ ఎం.విజయకృష్ణ మంగళవారం నేవీ, కోస్ట్ అధికారులకు లేఖ రాశారు. కాకినాడ, విశాఖ తీరంలో గస్తీ కాస్తున్న రెండు నౌకలతో పాటు నేవీ హెలికాప్టర్‌తో మంగళవారం సాయంత్రం వరకు గాలింపు చేపట్టగా.. మత్స్యకారుల ఆచూకీ లభించలేదు.

ఆర్డీవో పరామర్శ

విజయనగరం జిల్లా భోగాపురం మండలం ముక్కం గ్రామానికి చెందిన మత్స్యకారులు హార్బర్ సమీపంలోని జాలరిపేటలో నివాసం ఉంటున్నారు. గల్లంతైన మత్స్యకారుల కుటుంబాలను ఆర్డీవో డి.హుస్సేన్ సాహెబ్ పరామర్శించారు. బోటు వివరాలు, ఎప్పుడు వేటకు వెళ్లారు తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. నేవీ, కోస్ట్‌గార్డు సహాయంతో గాలింపు చర్యలు చేపట్టామని వివరించారు. గాజువాక, గంగవరం ప్రాంతాల్లో కూడా రెండు బోట్ల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టామన్నారు. కాగా.. మత్స్యకారుల గాలింపు చర్యలను మరింత విస్తృతం చేయాలని ఏపీ మెకనైజ్డ్ ఫిషింగ్ బోటు ఆపరేటర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వాసుపల్లి జానకీరామ్ కోరారు.

అండగా ఉంటాం

వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి

మహారాణిపేట: గల్లంతైన మత్స్యకారులు సురక్షితంగా ఒడ్డుకు చేరుకుంటారని వైఎస్సార్ సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, విశాఖ దక్షిణ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్ కుమార్.. ఆందోళన చెందుతున్న కుటుంబాలకు ధైర్యం చెప్పారు. హార్బర్‌లోని మత్స్యశాఖ జేడీ కార్యాలయం వద్ద బాధిత కుటుంబాలను మంగళవారం సాయంత్రం వారు పరామర్శించారు. ప్రభుత్వం అండగా ఉంటుందని వారికి ధైర్యం చెబుతూ.. గాలింపు చర్యలు విస్తృతంగా జరుగుతున్నాయని చెప్పారు. ఈ సందర్భంగా బొత్స ఝాన్సీ మీడియాతో మాట్లాడుతూ వేటకు వెళ్లిన మత్స్యకారులందరూ దృఢ సంకల్పంతో తిరిగి వస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. వాసుపల్లి మాట్లాడుతూ గాలింపు చర్యలపై కలెక్టర్‌తో మాట్లాడినట్లు చెప్పారు. వెళ్లిన వారందరూ యువకులేనని.. ఎలా అయినా వస్తారని మత్స్యకారుడిగా నమ్ముతున్నట్లు చెప్పారు. వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి ద్వారా సీఎం క్యాంప్ ఆఫీస్‌కి ఈ విషయం తెలియజేసినట్లు తెలిపారు. జీపీఎస్ ఉండుంటే ఈ పాటికే గుర్తించే అవకాశం ఉండేదన్నారు.



మత్స్యకారులతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్ కుమార్

కూటమిలో 'కమలం' కలకలం!

- విశాఖ లోక్‌సభ సీటు ఆశించి భంగపాటు
- టీడీపీకి కేటాయింపుపై బీజేపీ క్యాడర్ తిరుగుబావుటా
- ఎంపీ జీవీఎల్‌కు ఇవ్వాలని డిమాండ్
- పొత్తు సహకారంపై అనుమానాలు
- అభ్యర్థి భరత్ ప్రచారానికి దూరంగా శ్రేణులు
- ముఖ్య నేతలు అనకాపల్లికే ప్రాధాన్యం



విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సాక్షి, విశాఖపట్నం: కూటమిలో 'కమలం' కలకలం రేపుతోంది. ఎవరూ ఊహించని రీతిలో కమల దళం కూటమిపై తిరగబడింది. విశాఖ లోక్‌సభ సీటు తమకు దక్కుతుందని ఆ పార్టీ శ్రేణులు గట్టి నమ్మకంతో ఉన్నారు. అయితే అనూహ్యంగా ఆ సీటును టీడీపీకి కేటాయించడంతో వీరు కంగుతిన్నారు. ఈ టికెట్‌ను టీడీపీ అభ్యర్థి, లోకేష్ తోడల్లుడు భరత్‌కు ఖరారు చేసినప్పట్నుంచి వీరంతా తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు. ఆయనకు మద్దతుగా ప్రచారానికి వెళ్లకుండా దూరంగా ఉంటున్నారు. ఈ తరుణంలో ఒకడుగు ముందుకేసి విశాఖ లోక్‌సభ సీటును మార్పుచేసి బీజేపీకివ్వాలంటూ ఆ పార్టీ క్యాడర్, అనుబంధ సంఘాల నాయకులు మంగళవారం విశాఖలోని ఆ పార్టీ కార్యాలయం ఆవరణలోనే ఆందోళన చేపట్టడం, ఈ సీటును మూడేళ్లుగా విశాఖ అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావుకు ఇవ్వాలని డిమాండ్ చేయడం సంచలనమైంది. అంతేకాదు.. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పార్టీని అమ్మేశారని, తమ అధిష్టానం, టీడీపీ అధినేత చంద్రబాబు మోసం చేశారంటూ బహిరంగ విమర్శలకు దిగడం చర్చనీయాంశమైంది. మిత్రపక్షం బీజేపీ శ్రేణుల నుంచి ఇలాంటి పరిస్థితి ఊహించని టీడీపీలో ఈ పరిణామం పెను దుమారానికి దారితీసింది.

జీవీఎల్‌కు ఇవ్వాలని జాతీయ అధ్యక్షుడికి లేఖ

విశాఖ ఎంపీ సీటును ఆశించి భంగపడ్డ జీవీఎల్ మూడు రోజుల క్రితం మీడియాతో మాట్లాడుతూ తనకు ఈ టికెట్ రాకపోవడానికి సామాజిక, రాజకీయ సమీకరణాలు కారణం కాదని, కేవలం కుటుంబ సమీకరణాలేనని కుండబద్దలు కొట్టారు. త్వరలోనే పార్టీ నాయకులు, ముఖ్య కార్యకర్తలతో చర్చించి భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తానని కూడా వెల్లడించారు. అందులోభాగంగానే ఆ పార్టీ శ్రేణులు తాజాగా తిరుగుబావుటా ఎగరేశారని పలువురు భావిస్తున్నారు. మరో ఆసక్తి రేపే అంశం ఏమిటంటే.. తాము డిమాండ్ చేసినట్టు టీడీపీ అభ్యర్థిని మార్పు చేసి బీజేపీకి కేటాయించని పక్షంలో విడిగా స్నేహపూర్వక పోటీకి అనుమతించాలని కోరడం. ఒకవేళ టీడీపీ సీటును మార్చకపోతే తాము కూటమి అభ్యర్థికి సహకరించబోమని చెప్పకనే చెప్పినట్టయింది. ఇప్పటికే విశాఖ లోక్‌సభ ఉమ్మడి అభ్యర్థి భరత్‌కు మద్దతుగా బీజేపీ నుంచి ఆశించిన స్థాయిలో ప్రచారానికి ఎవరూ వెళ్లడం లేదు. పరిస్థితిని గమనించి భరత్ ఇటీవల నగరంలోని బీజేపీ కార్యాలయానికి వెళ్లారు. ఆ సమయంలో ఒకరిద్దరు మినహా చెప్పుకోదగ్గ నాయకులు లేకుండా పోయారు. పైగా భరత్‌కు దూరంగా ఉంటూ కొంతమంది నాయకులు పొరుగున ఉన్న అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ కోసం ప్రచారానికి వెళ్లడానికే ప్రాధాన్యతనిస్తున్నారు. అసలే టీడీపీకి ప్రజాదరణ అంతంత మాత్రంగా ఉన్న తరుణంలో బీజేపీ క్యాడరు ఎదురు తిరగడం, టీడీపీ అభ్యర్థిని మార్పు చేసి జీవీఎల్‌కు ఇవ్వాలంటూ ఏకంగా జాతీయ అధ్యక్షుడు నడ్డాకు లేఖ రాయడం కూటమికి మింగుడు పడడం లేదు.

హను మాన్

ఆరిలోవ: విశాఖ అందాలకు ఆస్ట్రేలియా క్రికెటర్ వార్నర్ ఫిదా అయ్యారు. ఐపీఎల్‌లో భాగంగా ఢిల్లీ క్యాపిటల్స్‌కు చెందిన వార్నర్ ప్రస్తుతం విశాఖలో ఉన్నారు. నగరంలో పర్యటించిన ఆయన హనుమంతవాక వద్ద జాతీయ రహదారిపై ఇటీవల జీవీఎంసీ ఏర్పాటు చేసిన ఆంజనేయ స్వామి విగ్రహాన్ని ఫొటో తీసి.. తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు. జై హనుమాన్ అంటూ క్యాప్షన్ ఇచ్చారు. వార్నర్ ఫాలోవర్స్ జై శ్రీరామ్.. హనుమాన్ అంటూ రిప్లై ఇస్తున్నారు. ఈ ఫొటోకు మంగళవారం రాత్రి వరకు 5 లక్షలకు పైగా లైక్‌లు, 13 వేలకు పైగా కామెంట్లు వచ్చాయి. ప్రస్తుతం ఈ ఫొటో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.



వార్నర్ హనుమంతవాక వద్ద తీసిన ఫొటో ఇదే..

తాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక సెల్

అల్లిపురం: వేసవి దృష్ట్యా జీవీఎంసీ పరిధిలో తాగునీటి సమస్యల పరిష్కారానికి టీఎస్సార్ కాంప్లెక్స్ నీటి సరఫరా విభాగంలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసినట్లు జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్‌వర్మ తెలిపారు. తాగునీటి సమస్యలపై 91541 09160, 0891–2746672 నంబర్లలో ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు సంప్రదించవచ్చని ప్రకటనలో పేర్కొన్నారు.

న్యాయవాదుల సంఘ ఎన్నికలకు ఏర్పాట్లు

విశాఖ లీగల్: విశాఖ న్యాయవాదుల సంఘం వార్షిక ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు ఎన్నికల సంఘం అధికారి, సీనియర్ న్యాయవాది కేశప్రగడ వెంకట నరసింహమూర్తి తెలిపారు. ఎన్నికలు గురువారం ఉదయం 10.30 గంటలకు ప్రారంభమై సాయంత్రం 4 గంటలకు ముగుస్తాయన్నారు. సాయంత్రం 6 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందన్నారు. ఎన్నికల బరిలో వివిధ పోస్టులకు 49 మంది పోటీలో ఉన్నారని తెలిపారు. ఎన్నికలకు సంబంధించి ఏడు పోలింగ్ బూతులు ఏర్పాటు చేశామన్నారు. అన్నింటిలోనూ సీసీ కెమెరాల అమర్చినట్టు చెప్పారు. మొత్తం 2,866 న్యాయవాదులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని తెలిపారు. ప్రతి జూనియర్ న్యాయవాది గుర్తింపు కార్డును తప్పనిసరిగా తీసుకురావాలని, 1990కి ముందు న్యాయవాదులుగా వృత్తి ప్రారంభించిన వారికి ఎటువంటి గుర్తింపు కార్డు అవసరం లేదన్నారు. సీనియర్ న్యాయవాదులు తమ ఓటును ఇంటి వద్దనే వేసే విధంగా తగిన ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఎన్నికలు శాంతియుత వాతవరణంలో నిర్వహించడానికి న్యాయవాదులందరూ సహకరించాలని ఆయన కోరారు. విశాఖ న్యాయవాదుల సంఘానికి 1931 నుంచి ఎన్నికలు జరుగుతున్నాయి.

హౌరా-యశ్వంత్‌పూర్ మధ్య ప్రత్యేక రైళ్లు

తాటిచెట్లపాలెం : ప్రయాణికుల రద్దీ దృష్ట్యా హౌరా-యశ్వంత్‌పూర్-హౌరా మధ్య వీక్లీ ఏసీ స్పెషల్ నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి తెలిపారు. హౌరా-యశ్వంత్‌పూర్ (02863) వీక్లీ ఏసీ స్పెషల్ ఈ నెల 4,11వ తేదీల్లో(గురువారాల్లో) హౌరాలో మధ్యాహ్నం 12.40గంటలకు బయల్దేరి మరుసటిరోజు (శుక్రవారం)తెల్లవారు 2.43గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడ నుంచి 2.45గంటలకు బయల్దేరి అదేరోజు మధ్య రాత్రి 12.15గంటలకు యశ్వంత్‌పూర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో యశ్వంత్‌పూర్-హౌరా (02864) వీక్లీ స్పెషల్ రైలు శనివారాల్లో ఈ నెల 6,13 తేదీల్లో యశ్వంత్‌పూర్‌లో తెల్లవారు 5 గంటలకు బయల్దేరి అదేరోజు రాత్రి 11.05గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడ నుంచి 11.07గంటలకు బయల్దేరి మరసటిరోజు మధ్యాహ్నం 1.25గంలకు హౌరా చేరుకుంటుంది.



డీసీ X కేకేఆర్
నేడే బిగ్ ఫైట్

విశాఖ స్పోర్ట్స్: ఐపీఎల్‌లో భాగంగా మరో మ్యాచ్‌కు వైఎస్ రాజశేఖరరెడ్డి స్టేడియం సిద్ధమైంది. క్రికెట్ అభిమానులను అలరించేందుకు ఢిల్లీ క్యాపిటల్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ బుధవారం బరిలోకి దిగుతున్నాయి. లక్ష్య ఛేదనతోనే ఆడిన రెండు మ్యాచ్‌ల్లో సాధించిన విజయాలకు కొనసాగింపుగా నైట్ రైడర్స్.. లక్ష్యాన్ని నిర్దేశించగా వచ్చిన విజయానికి కొనసాగింపుగా క్యాపిటల్స్ ఢీకొడుతున్నాయి. మంగళవారం రాత్రి ఇరు జట్లు వైఎస్సార్ స్టేడియంలో ప్రాక్టీస్ చేసి.. నేటి మ్యాచ్‌కు అస్త్రశస్త్రాలు సిద్ధం చేసుకున్నాయి. బుధవారం రాత్రి 7.30 గంటలకు ప్రారంభమయ్యే మ్యాచ్‌కు జిల్లా యంత్రాంగం అంతా సిద్ధం చేసింది.


ప్రాక్టీస్ చేస్తున్న డీసీ ఆటగాళ్లు






పిచ్ పరిశీలిస్తున్న గంగూలీ



ఇద్దరి మధ్య ఘర్షణ : ఒకరి మృతి


అల్లిపురం: ఇద్దరు వ్యక్తుల మధ్య ఘర్షణలో ఓ వ్యక్తి మృతి చెందాడు. టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం సాయంత్రం ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలివీ.. నేరెళ్లకోనేరు జంక్షన్‌లో పేపకాయల శ్రీరాములు (57) ఆటోలో సోడా వ్యాపారం చేస్తున్నాడు. మంగళవారం రాత్రి 7.30 గంటల ప్రాంతంలో సోడాలు అమ్ముతుండగా అదే ప్రాంతంలో రేషన్ డిపో నిర్వహిస్తున్న అంతకుల దాము అతనితో గొడవకు దిగాడు. తన షాపు ఎదురుగా సోడాల వ్యాపారం చేస్తావా అంటూ శ్రీరాములును తోసేశాడు. దీంతో శ్రీరాములకు గుండెనొప్పి రావడంతో అక్కడికక్కడే చనిపోయాడు. స్థానికుల సమాచారంతో ఈస్ట్ ఏసీపీ జయరామ్‌ప్రసాద్, టూటౌన్ సీఐ బి.తిరుమలరావు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.


శ్రీరాములు మృతదేహం, వివరాలు సేకరిస్తున్న సీఐ తిరుమలరావు

పిస్టల్‌తో యువకులు

రిమాండ్‌కు తరలించిన పోలీసులు

ఆరిలోవ: పిస్టల్ కలిగి ఉన్న కేసులో ఆరిలోవ పోలీసులు ముగ్గురు యువకులను రిమాండ్‌కు తరలించారు. ఆరిలోవ సీఐ గోవిందరావు తెలిపిన వివరాలివీ.. చినగదిలి సాయిబాబా గుడి కూడలి వద్ద ఈ నెల 1న సాయంత్రం ఆరు గంటల సమయంలో నక్క లోకేష్ అలియాస్ కిట్టు, గొలగాని శివకుమార్ యాదవ్, కొంగరాని ప్రవీణ్‌కుమార్ అనుమతి లేని 19 ఎంఎం పిస్టల్, రెండు బుల్లెట్లు విక్రయించడం కోసం ప్రయత్నిస్తున్నారు. ఈ సమాచారం అందుకున్న ఆరిలోవ సీఐ జి.గోవిందరావు, ఎస్ఐ వై.కృష్ణ సిబ్బందితో కలసి అక్కడకు చేరుకున్నారు. గన్‌తో తిరుగుతున్న ముగ్గురినీ అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న పిస్టల్, రెండు బుల్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేపట్టడంతో అసలు విషయం బయటపడింది. కొద్ది రోజుల కిందట మరణించిన రౌడీషీటర్ కోరాడ సాయి 2018లో నక్క లోకేష్‌కు ఈ పిస్టల్, రెండు బుల్లెట్లను ఇచ్చాడు. అప్పటి నుంచి అవి లోకేష్ వద్ద ఉన్నాయి. వాటిని విక్రయించడానికి లోకేష్ తన స్నేహితులు గొలగాని శివకుమార్, కొంగరాని ప్రవీణ్‌కుమార్‌ను పిలిచాడు. వీటిని ఎవరికైనా విక్రయించాలనే ప్రయత్నం పోలీసులకు పట్టుబడ్డారు. ముగ్గురిపై కేసు నమోదు మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. పూర్తిస్థాయిలో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.


నిందితుల వద్ద పట్టుబడిన తుపాకీ, బుల్లెట్లు

ఉత్సాహంగా డాక్‌యార్డ్ డే



ఉత్తమ పనితీరు కనబర్చిన ఉద్యోగులకు అవార్డులను అందిస్తున్న రియర్ అడ్మిరల్ విజయ్‌శేఖర్

సింధియా : విశాఖపట్నంలోని నేవల్ డాక్‌యార్డ్‌లో అడ్మిరల్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో డాక్‌యార్డ్ డేను మంగళవారం నిర్వహించారు. సుమారు 4వేల మంది డాక్‌యార్డ్ ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులతో పాల్గొన్నారు. డాక్‌యార్డ్‌లోని పలు విభాగాల్లో ఉత్తమ పనితీరు కనబర్చిన ఉద్యోగులకు రియర్ అడ్మిరల్ ఆర్ విజయ్‌శేఖర్ ఏఎస్‌డీ అవార్డులను అందజేశారు. తూర్పు నావికాదళ బ్యాండ్, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

రూ.6.67లక్షల స్వాధీనం

గోపాలపట్నం: ఎన్నికల ప్రక్రియలో భాగంగా గోపాలపట్నం బంక్ జంక్షన్‌లో మంగళవారం వాహనాలను పోలీసులు తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో 8 మంది వాహనదారుల వద్ద 6.67లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ఈ నగదుకు సంబంధించిన వారి వద్ద ఎటువంటి ఆధారాలు లేకపోవడం వల్ల స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సురేష్, ఎస్ఐ అప్పలనాయుడు తెలిపారు.



బస్సును తనిఖీ చేస్తున్న పోలీసులు

దివ్యాంగుల నుంచి ఫిర్యాదుల స్వీకరణ

ఏయూక్యాంపస్ : దిశ దివ్యాంగ సురక్షలో భాగంగా డయల్ యువర్ సీపీ కార్యక్రమంలో దివ్యాంగుల నుంచి పలు ఫిర్యాదులను సీపీ రవిశంకర్ స్వీకరించారు. నలుగురు అంధులు, ఆరుగురు దివ్యాంగులు ఫోన్ చేసి తమ సమస్యలు వివరించారు. గతంలో టోల్‌ఫ్రీలో తమ సమస్యలకు పరిష్కారం లభించడంపై విశాఖకు చెందిన దివ్యాంగుడు మనోజ్ కుమార్, అంధుడు అర్జునరావు, భీమిలికి చెందిన దివ్యాంగుడు అప్పారావు సీపీకి కృతజ్ఞతలు తెలిపారు. వరంగల్, వినుకొండ, విశాఖ, హైదరాబాద్ ప్రాంతాల నుంచి పలువురు దివ్యాంగులు ఫోన్ చేసి తమ సమస్యలను వివరించారు. ఫిర్యాదులు స్వీకరించిన అనంతరం సంబంధిత అధికారులకు సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని ప్రతీనెల 2, 15వ తేదీల్లో సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు నిర్వహిస్తున్నారు.

చంద్రబాబుకు ఓటమి భయం

- పింఛన్‌దారుల పాపం పక్కా తగులుతోంది
- రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు, శాసన మండలి విప్ వరుదు కల్యాణి


మాట్లాడుతున్న వరుదు కల్యాణి

సాక్షి, విశాఖపట్నం: ఓటమి భయంతో మతిభ్రమించి పేద ప్రజలపై, అవ్వా తాతలపై చంద్రబాబు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నాడని వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు, శాసన మండలి విప్ వరుదు కల్యాణి మండిపడ్డారు. మంగళవారం సిరిపురంలో గల ఆమె కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఒకటో తేదీ ఎప్పుడొస్తుందా..? అని ఎదురుచూసే పండుటాకుల ఆశలపై చంద్రబాబు నీళ్లు చల్లారన్నారు. ఎన్నికల కోడ్ మూడు నెలల పాటు అవ్వాతాతలకు పింఛను అందకుండా అడ్డుకొని రాక్షస ఆనందం పొందుతున్నాడని మండిపడ్డారు. 14 ఏళ్ల పాటు సీఎంగా పనిచేసిన చంద్రబాబు పేద ప్రజల కోసం ఏరోజైనా ఆలోచన చేశారా..?అని విమర్శించారు. పేదవాళ్లు అంటే మొదటి నుంచి చంద్రబాబుకు చులకన భావమని, వాళ్లను తక్కువ చేస్తూ మాట్లాడిన సందర్భాలు ఎన్నో చూశామని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అందించిన సంక్షేమం, అభివృద్ధే 2024లో మరో మారు విజయాన్ని అందిస్తోందని ధీమా వ్యక్తంచేశారు. ఇప్పటివరకు రూ.2.7 లక్ష కోట్లు డీబీటీ పద్ధతిలో నేరుగా పేదల బ్యాంక్ ఖాతాల్లో జమ చేసి ఆర్థికంగా బలోపేతం చేశారని కొనియాడారు. ఈ పాలన చూసే చంద్రబాబు పేదలకు సంక్షేమం అందకుండా కుట్రలు, కుతంత్రాలకు తెరలేపుతున్నాడని మండిపడ్డారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా.. ప్రజల మనస్సులో సీఎం జగనన్నపై ఉన్న ప్రేమ, ఆప్యాయతను చెరపలేరని, ఆయన అందించిన గొప్ప పరిపాలనే మరో మారు సీఎంగా గెలిపించనుందన్నారు. గతంలో పవన్ కల్యాణ్ వలంటీర్లు మహిళల అక్రమ రవాణా చేస్తారని వ్యాఖ్యానించారని గుర్తు చేశారు. వలంటీర్లలో 76 శాతం మహిళలే ఉన్నారు. మహిళలే ఇలాంటి పనులు చేస్తారా, అలాగే వలంటీర్లలో 60 శాతం పైగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలే ఉన్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా ఒక్క రూపాయి కూడా అవినీతి లేకుండా, లంచాలు లేకుండా నేరుగా ప్రజలకు సంక్షేమ పథకాలు అందించిన ప్రభుత్వం వైఎస్సార్ సీపీ అని కొనియాడారు.

వైఎస్సార్ సీపీలోకి టీడీపీ, జనసేన నాయకులు

అక్కిరెడ్డిపాలెం: యారాడ, పాతగాజువాక, పెదగంట్యాడ ప్రాంతాల నుంచి 300 మంది టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు మంగళవారం వైఎస్సార్ సీపీలో చేరారు.

రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డైరెక్టర్ మొల్లి చిన్న ఆధ్వర్యంలో మిందిలో జరిగిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకుడు కిలాని కనకరాజు, జనసేన నాయకుడు ఉరుకూటి ధనాజీరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సుపరిపాలనకు ఆకర్షితులై వైఎస్సార్ సీపీలో చేరుతున్నట్లు తెలిపారు. టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తుతో.. కార్యకర్తలకు విలువ లేకుండా పోయిందన్నారు. ఈ ఎన్నికల్లో గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ విజయానికి కృషి చేస్తామన్నారు. టీడీపీ నాయకులు కిలాని కిశోర్, పల్లా ధనుష్ యాదవ్, కిలాని అప్పలరాజు, ఉరుకూటి రమేష్, ఉరుకూటి సాయి, ఉరుకూటి ప్రవీణ్, సారిపల్లి మాణిక్యం, మచ్చి రాజు, జనసేన నాయకులు చట్టి చిన్నారావు, గొలగాని శ్రీను, రోమాన ధనుష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ, జనసేన కార్యకర్తలు, నాయకులతో ఎమ్మెల్యే అభ్యర్థి అమర్‌నాథ్


హత్యాయత్నం కేసులో ముగ్గురు టీడీపీ-జనసేన కార్యకర్తల అరెస్ట్

పెందుర్తి : మండలంలోని చింతగట్లకు చెందిన రాష్ట్ర అయ్యారక వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ గనిశెట్టి కనకరాజుపై హత్యాయత్నానికి పాల్పడిన ముగ్గురు టీడీపీ-జనసేన కార్యకర్తలను పెందుర్తి పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. వివరాలివి.. ఓ భూ వివాదంలో చింతగట్లలో నివాసం ఉంటున్న గనిశెట్టి కనకరాజుపై గతేడాది నవంబర్ 10న అదే గ్రామానికి చెందిన జనసేన-టీడీపీ కార్యకర్తలు చందక గోవిందరాజు, మాడిస హరిష్, దాసరి గణేష్‌లు ఆయుధాలతో దాడి చేశారు. దీంతో కనకరాజు తీవ్ర గాయాల పాలై ఆస్పత్రిలో చికిత్స పొంది కోలుకున్నారు. బాధితుడు కనకరాజు ఫిర్యాదు మేరకు సమగ్ర విచారణ చేసిన పెందుర్తి పోలీసులు నిందితులు గోవిందరాజు, హరీష్, గణేష్‌లను అరెస్ట్ చేసినట్లు సీఐ రామకృష్ణ వెల్లడించారు. వీరికి ఈ నెల 15 వరకు కోర్టు రిమాండ్ విధించింది.

ఇద్దరు కానిస్టేబుళ్ల సస్పెన్షన్

మద్రిపాలెం: ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇద్దరు కానిస్టేబుళ్లు సస్పెండ్ అయ్యారు. ఆదివారం జరిగిన ఐపీఎల్ మ్యాచ్ బందోబస్తుకు కానిస్టేబుళ్లు యోగి, ప్రకాష్ హాజరయ్యారు. విధుల్లో అలసత్వం వహించారని ఆరోపణల నేపథ్యంలో వీరిని ఉన్నతాధికారులు మంగళవారం సస్పెండ్ చేశారు.

ఆకట్టుకుంటున్న వస్త్ర ప్రదర్శన


ఎగ్జిబిషన్‌లో చీరలు పరిశీలిస్తున్న మహిళలు

బీచ్‌రోడ్డు: తాజ్ గేట్‌వే హోటల్‌లో ఏర్పాటు చేసిన వసుధ ఫ్యాషన్ అండ్ లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్ విశాఖవాసులను ఆకట్టుకుంటుంది. మహిళలు, విద్యార్థినులకు ఉపయోగపడేలా ప్రఖ్యాతిగాంచిన సుమారు 50కు పైగా డిజైనర్స్ రూపొందించిన వస్త్రాలను ప్రదర్శనలో ఉంచినట్లు నిర్వాహకులు ప్రవీణ్ కుమార్, సీతాకాంత్ తెలిపారు. ముంబై, ఢిల్లీ, అహ్మదాబాద్, జైపూర్, కోల్‌కతా, మధ్యప్రదేశ్, చెన్నై, హైదరాబాద్ నగరాల నుంచి లేటెస్ట్ డిజైనర్స్ రూపొందించిన వస్త్రాలు అందుబాటులో ఉంచామన్నారు. ప్రదర్శన బుధవారం రాత్రి 9 గంటల వరకు కొనసాగుతుందన్నారు.

ఉత్తరాంధ్రపై కూటమి కుట్ర

మాజీ ఎమ్మెల్యే అల్లు భానుమతి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అల్లు భానుమతి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి రఘురాజు

బీచ్‌రోడ్డు : ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందకుండా కూటమి విషం కక్కుతోందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నేత అల్లు భానుమతి పేర్కొన్నారు. బీచ్‌రోడ్డులోని ఆమె కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి రఘురాజుతో కలిసి ఆమె మంగళవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగుదేశం, జనసేన, బీజేపీ అభ్యర్థుల్లో చాలా మంది స్థానికేతరులున్నారని, వారు ఉత్తరాంధ్రను దోచుకోవడానికే వచ్చారన్నారు. విశాఖ తూర్పు, భీమిలి, ఉత్తర, అనకాపల్లి పార్లమెంట్, ఎచ్చెర్ల స్థానాల్లో స్థానికేతరులకు సీట్లు కేటాయించడంతో కూటమి కుట్ర బయటపడిందన్నారు. విశాఖ పరిపాలన రాజధాని కాకుండా చేయడం వీరి కుట్రలో భాగమన్నారు. ఉత్తరాంధ్రలో అసలు ఉనికేలేని చంద్రబాబు సామాజిక వర్గానికి సీట్లు కేటాయించడం వెనుకబడిన వర్గాలను తొక్కేయడమేనన్నారు. పేదలు బాగుండాలి..వారి సంక్షేమమే ముఖ్యమని భావించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఎవరు ఎన్ని కుట్రలు చేసినా ప్రజలే తిప్పికొడతారన్నారు. ప్రతీ నెల ఒకటో తేదీన ఇంటి తలుపుతట్టి పింఛను ఇచ్చిన వలంటీర్లను చంద్రబాబు, ఆ పార్టీ నేతలు అడ్డుకోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. అవ్వతాతలు మండుటెండలో ఎంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. కూటమికి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

టీడీపీ ప్రచారంలో జీవీఎంసీ ఉద్యోగులు


టీడీపీలో పదవులు అనుభవిస్తున్న జీవీఎంసీ ఉద్యోగులు సురేష్, గవ్వ భాస్కర్


గణబాబు ప్రచారంలో పాల్గొన్న మలేరియా విభాగంలో పనిచేస్తున్న మహిళలు (సర్కిల్‌లో)

పార్టీ పదవుల్లోనూ కొనసాగుతున్న వైనం

గోపాలపట్నం : ఎన్నికల నిబంధనలను సక్రమంగా అమలు చేయాల్సిన ఉద్యోగులే గీత దాటుతున్నారు. జీవీఎంసీలో పలు శాఖల ఉద్యోగులు కొందరు ప్రభుత్వ జీతం తీసుకుంటూనే వార్డు స్థాయిలో తెలుగుదేశం పార్టీ పదవుల్లో కొనసాగుతున్నారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మల్లికార్జున ఆదేశాలు కూడా పట్టించుకోకుండా ఏకంగా టీడీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి గణబాబుతో కలిసి ప్రచారంలో పాల్గొంటున్నారు. జీవీఎంసీ ఉద్యోగులు ఇలా ఎన్నికల ప్రచారంలో పాల్గొనడంతో.. ఇక్కడ వీరికేం పనంటూ జనం నిలదీస్తున్నారు. ఇటీవల టీడీపీ ప్రచారంలో మలేరియా విభాగంలో పనిచేస్తున్న నూనెల ఇందు, చిన్నపల్లి సూర్యకళ టీడీపీ అభ్యర్థి గణబాబు నిర్వహించిన ప్రచారంలో పాల్గొన్నారు. అలాగే జీవీఎంసీ యూజీడీ విభాగంలో పనిచేస్తున్న దాడి సురేష్ టీడీపీలో జిల్లా యూత్ విభాగం ఉపాధ్యక్షుడిగా, గవ్వ భాస్కర్ వార్డు కార్యదర్శిగా కొనసాగుతున్నారు. జీవీఎంసీ 19, 92, 89 వార్డుల్లో టీడీపీ ఏ కార్యక్రమం చేపట్టినా వీరు చురుగ్గా పాల్గొంటున్నారు. ఏకంగా టీడీపీ కండువాలతో వీరు ప్రచారాలు చేస్తున్నారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందజేస్తున్నారు. కొన్ని కుటుంబాలను ప్రలోభాలకు గురిచేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇలా బరితెగించి వీరు ప్రచారం చేస్తున్నా ఎన్నికల అధికారులను పట్టించుకోకపోవడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వీరి ప్రచార ఫొటోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నా అధికారులకు కనిపించకపోవడం విడ్డూరం. ఇప్పటికైనా ఇలాంటివారిపై ఎన్నికల అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు పార్టీ నేతలు కోరుతున్నారు.